రైతులకు మరింత సహకారం

- రూ.7.43 కోట్లతో సొసైటీల అభివృద్ధి
- రైతులకు మెరుగైన సేవలు
- విదేశీ విద్యకు సైతం విద్యా రుణాలు



నూతనంగా నిర్మించిన తుక్కులూరు సొసైటీ భవనం

నూజివీడు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయంతో పాటు సహకార రంగాన్ని అన్ని విధాలుగా బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలను అందించడమే కాకుండా అన్ని సహకార సంఘాలను అభివృద్ధి చేస్తూ, బడ్జెట్‌లో నిధులు కేటాయించడమే కాకుండా సహకార సంఘాలకు సొంత భవనాలను నిర్మిస్తున్నారు. శిథిలమైన భవనాలను ఆధునికీకరిస్తున్నారు. వీటికి తోడు సహకార కేంద్ర బ్యాంకులను ఆధునికీకరించడంతో వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలందిస్తున్నాయి.

నూజివీడు నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని కేడీసీసీబీ బ్రాంచ్‌లకు నూతన భవనాలను, ఆధునికీకరణ పనులను, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)లకు నూతన భవనాల నిర్మాణం, ఆధునికీకరణ పనులను కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చొరవతో చేపట్టారు. నూజివీడు, చాట్రాయి, ఆగిరిపల్లిలలోని కేడీసీసీబీ భవనాలను రూ.1.36 కోట్లతో ఆధునికీకరించారు. దీనిలో చాట్రాయిలో రూ.కోటి వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించారు. ఆగిరిపల్లిలో రూ.16.75 లక్షలతో ఏటీఎం ఏర్పాటు, ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. నూజివీడులో రూ.20.50 లక్షలతో ఆధునికీకరణ పనులు చేశారు. అంతేగాకుండా రూ.6.08 కోట్లతో నియోజకవర్గంలోని పలు సొసైటీలకు నూతన భవనాలను నిర్మించడం, పెట్రోలు బంకులను ఏర్పాటు చేయడం, గోడౌన్లను నిర్మించి రైతులకు మెరుగైన సేవలు అందేలా ఏర్పాట్లు చేశారు. చాట్రాయి మండలంలోని చిన్నంపేట, తుమ్మగూడెం, పోలవరంలో ఒక్కొక్కటి రూ.కోటి వ్యయంతో పెట్రోలు బంకులను ఏర్పాటు చేశారు. అలాగే నూజివీడు మండలం తుక్కులూరులో రూ.43 లక్షలతో నూతన సొసైటీ భవనాన్ని నిర్మించి దీనిలో క్యాష్ కౌంటర్, లాకర్లను సైతం ఏర్పాటు చేశారు. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో సొసైటీకి నూతన కార్యాలయాన్ని, నూతన గోడౌన్‌ను రూ.40.50 లక్షలతో నిర్మించారు. అదేవిధంగా నియోజకవర్గంలో ఈదులగూడెం, తుమ్మగూడెం, పోలవరం, చిన్నంపేట, చనుబండ, రమణక్కపేట, చెక్కపల్లి, గోపవరం, కాట్రేనిపాడులలోని సొసైటీలకు నూతన భవనాలను నిర్మించడం, ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. నూతన భవనాలను నిర్మించిన సొసైటీల్లో క్యాష్ కౌంటర్లు, స్ట్రాంగ్‌రూమ్‌లు, లాకర్లు ఏర్పాటు చేయడంతో పాటు గోల్డ్‌లోన్ సౌకర్యాన్ని కల్పించి సంఘాల వ్యాపార అభివృద్ధికి తోడ్పాటును అందించారు. దీంతో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు పరిష్కారం కావడంతో సహకార సంఘాల అధ్యక్షులతో పాటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతాంగానికి గోడౌన్ల సదుపాయం

గత ప్రభుత్వాలు చేయలేని విధంగా రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్ గోడౌన్‌లను అడవినెక్కలం, ఈదులగూడెం, చిన్నంపేట, చనుబండ, రమణక్కపేట సొసైటీల వద్ద నిర్మించారు. దీని వల్ల వర్షాల సమయంలోను, తుపానుల సమయంలో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి ఈ గోడౌన్‌లు దోహదపడనున్నాయి. అంతేగాకుండా సొసైటీల ద్వారా ఎరువులను విక్రయించేందుకు సైతం గోడౌన్‌లు ఉపయోగపడతాయి. అలాగే పోలవరం, తుమ్మగూడెంలలో మీటింగ్ హాల్‌లను సైతం నిర్మించారు. ఈ విధంగా అన్ని రకాల సదుపాయాలను గత రెండేళ్లలో అందుబాటులోకి రావడంతో ఇవి రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

అర్హతను బట్టి రుణం ఇస్తున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సహకార సంఘాలు అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్నాయి. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో రూ.7.43 కోట్లతో నూతన సొసైటీ భవనాలు, గోడౌన్‌లను నిర్మించడంతో పాటు ఆధునికీకరణ పనులను చేపట్టాం. ఒక్కో రైతుకు అర్హతను బట్టి రూ.8 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు రుణాన్ని ఇస్తున్నాం.

– తన్నీరు నాగేశ్వరరావు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్

సహకార సంఘాల అభివృద్ధికి కృషి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని సొసైటీల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. గతంలో లేని విధంగా నేడు ఎకరాకు రూ.8లక్షల వరకు సొసైటీల్లో రుణాలను ఇస్తున్నాం. రైతులకు క్యాష్ కౌంటర్లు, లాకర్లను అందుబాటులోకి తీసుకొచ్చాం. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను అర్హత ఉన్న రైతులందరికీ అందిస్తున్నాం.

– మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎమ్మెల్యే, నూజివీడు

ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు



తోటమూల(గంపలగూడెం): జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశానుసారం గంపలగూడెం మండలం పెద్దకొమిర శివారు తోటమూలలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలను గ్రామ పంచాయతీ చేపట్టింది. ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, ఈఓ జీ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ వేముల కస్తూరి పర్యవేక్షణలో కార్యదర్శి వీ నరసింహారావు ఆధ్వర్యంలో దీర్ఘకాలంగా గ్రామంలోని పలుప్రాంతాల్లో పేరుకు పోయిన చెత్త కుప్పలను ఆదివారం పొక్లెయిన్ ఏర్పాటు చేసి ట్రాక్టర్లతో ఊరుబయటకు తరలించారు. ప్రధానంగా గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద, పెదరాశిగుంట సమీపంలోనూ, వై-జంక్షన్ ప్రాంతంలో, గోసవీడు రహదారి వెంట పేరుకుపోయిన కుప్పలను తొలంగిచారు. ఆయా ప్రాంతంలో చెత్తకుప్పలను తొలగించడంతోపాటుగా పొక్లెయిన్‌తో కచ్చాడ్రైన్‌లు ఏర్పాటు గావించి వర్షపునీరు దిగువకు పారేవిధంగా చర్యలు తీసుకున్నారు.

విశ్వ కవి ఠాగూర్‌కు ఘన నివాళి

మైలవరం: భారతదేశానికి జాతీయ గీతం అందించిన విశ్వకవి, ప్రసిద్ధులు, నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆయన సేవలు కొనియాడుతూ మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం ఘనంగా నివాళులర్పించారు.

క్లుప్తంగా

ఘనంగా కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్ట



తాతకుంట్ల (విస్సన్నపేట): మండలంలోని తాతకుంట్ల తండాలో కోదండరామ స్వామి, పరివారదేవతా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, విస్సన్నపేట సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

చాట్రాయి: మొక్కజొన్న సాగు చేసిన రైతులు తమ పేర్లను ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల మొక్క జొన్న పంటను క్వింటా రూ.1,962 ధరకు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

మైలవరం: మైలవరం శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 14వ తేదీ వరకు పాఠశాలలకు సెలవులు కావున పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు మైలవరం శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి సయ్యద్ అహ్మద్ తెలిపారు. పిల్లలు తమ సెలవులను సక్రమంగా వినియోగించుకునేలా చేయడం, చదివే అలవాటును పెంపొందించడం, పాఠశాల వయస్సు పిల్లలను గ్రంథాలయానికి వచ్చే విధంగా అలవాటు చేయడం దీనిలోని ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు, ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు రవాణా సమస్య ఉన్నందున వారిని మినహాయించవచ్చని తెలిపారు.

పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు

తిరువూరు: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 10న జరిగే పాలిసెట్ నిర్వహణకు తిరువూరులో అధికారులు ఏర్పాట్లు చేశారు. 1,600 మంది విద్యార్థులను తిరువూరు పరీక్ష కేంద్రాలకు కేటాయించారు. వాహినీ ఇంజినీరింగ్ కళాశాల, వాహినీ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీనిధి టెక్నో స్కూల్, శ్రీనిధి జూనియర్ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో పరీక్ష నిర్వహిస్తారు.

పంటలను కాపాడుకోవాలి

చాట్రాయి: తుపాను వలన రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖాధికారి హేమ తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చేలల్లో నిల్వ నీరు లేకుండా తొలిగించాలని, తుపాను వలన పండ్ల చెట్లు పడిపోతే నిలబెట్టి చెట్టు చుట్టూ మట్టిని ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. చెట్లు త్వరితగతిన కోలుకోవడానికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, 1.25 గ్రా ముల బొరాక్స్‌ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. త్వరితగతిన మామిడి పంటను కోసుకోవాలని ఆమె సూచించారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమల్లో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో..

నూజివీడు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజీంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారం నిమిత్తం అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు.

ప్రశాంతంగా నీట్ ప్రవేశ పరీక్ష

జూపూడి(ఇబ్రహీంపట్నం): వైద్య విద్యా కోర్సుల్లో జాతీయ స్థాయి ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్ష స్థానిక నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్ష హాల్‌లోకి పంపే ముందు అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలకు అనుమతించారు. వివిధ జిల్లాలకు చెందిన 936 మంది నీట్ పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే రక్షణనిధి



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. ఏ కొండూరు పీఏసీఎస్‌లో ఆదివారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కజొన్న పండించిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ చేయించిన రైతుల నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ వారి ద్వారా కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక క్వింటా రూ.1,962ల ప్రభుత్వ ధర లభిస్తుందన్నారు. తేమ శాతం 14 కంటే తక్కువగా ఉండేలా ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి మొక్కజొన్న శాంపిల్ తీసుకుని రావాలని తెలిపారు. రైతులు దళారులు వద్దకు వెళ్లి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్నలు విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ నాగ నర్సిరెడ్డి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ కోటగిరి వెంకట పురుషోత్తం, సర్పంచ్ వెంపాటి రంజిని, వైస్ ఎంపీపీ సిద్ధం పద్మ, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కే చెన్నారావు, పీఏసీఎస్ డైరెక్టర్ భూక్య వెంకటేశ్వరరావు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఏఓ టిప్పు సుల్తాన్, సీఈఓ వి. నరసింహారావు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



చెక్కపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ముసునూరు: ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన, నేల కొరిగిన మొక్కజొన్న, వరి, పంటలను వ్యవసాయ శాఖాధికారులు పరిశీలించారు. మండలంలోని చెక్కపల్లి, వలసపల్లి గ్రామాల్లో వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌బీకేల క్షేత్ర స్థాయి సిబ్బంది ఆదివారం మొక్కజొన్న, వరి చేలల్లో తడిసిన, నేలకొరిగిన పంటలను పరిశీలన చేసి, రైతులకు పలు సూచనలు చేశారు. 10 నుంచి 15 రోజుల్లో కోతకు వచ్చే వరి చేను పడిపోయి పంట తడిసినట్లయితే బూజు తెగులు సోకి గింజ రంగు మారే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే ఒక లీటరు నీటికి 1.0 మి.లీ ప్రొపికొనిజోల్ లేదా కార్బెండిజమ్‌ను కలిపి పిచికారీ చేసి పంటను రక్షించుకోవాలని సూచించారు.

అరటి మొక్కలను వెంటనే నిలబెట్టాలి

మండలంలోని ముసునూరు, వలసపల్లి గ్రామా ల్లోని అరటి, మిర్చి తోటలలో నేలకూలిన అరటి పంటను, కల్లాలపై ఉన్న మిర్చి పంటను ఉద్యానవన శాఖాధికారిణి హేమ సిబ్బందితో కలసి ఆదివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో నేలకొరిగిన అరటి మొక్కలను వెంటనే నిలబెట్టి, చుట్టూ మట్టిని ఎగదోసి, ఊతమివ్వాలని రైతులకు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న మామిడి కాయలను త్వరగా కోసివేయాలన్నారు.

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఆచూకీ లభ్యం

ఆగిరిపల్లి: అదృశ్యమైన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ ఎస్.చంటిబాబు ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు 39వ సీఆర్‌పీఎఫ్ గన్నవరం హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన 2011 బ్యాచ్ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్ మండలంలోని నూగొండపల్లిలో గల సీఆర్పీఎఫ్ అవుట్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. గత ఏడాది డిసెంబర్ నుంచి గత నెల 30 వరకు ఉన్నతాధికారుల వద్ద ఎటువంటి అనుమతి తీసుకోకుండా వెళ్లిపోయాడు. ఈ క్రమంలో గత నెల 30న నూగొండపల్లిలో సీఆర్పీఎఫ్ అవుట్‌పోస్టుకు వచ్చి శ్రీనివాస్ ఒక రోజు విధుల్లో చేరి కనిపించకుండా వెళ్లిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్‌ఐ తన సిబ్బంది, బంధువుల సహకారంతో గాలింపు చేపట్టారు. గన్నవరంలో ఒక హోటల్ గదిలో అనారోగ్య కారణంతో విశ్రాంతి తీసుకుంటున్న శ్రీనివాస్‌ను గుర్తించారు. అతన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ అనంతరం భార్య, బంధువులకు అప్పగించారు.

ఘనంగా అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్

ముసునూరు: శ్రీపోతురాజుస్వామి, నాగేంద్ర స్వామి సమేత అంకమ్మ తల్లి విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. కొంజెర్లలో 400 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయంలో మూడు రోజులుగా అభిషేకాలు, హోమం, ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. భక్తుల అంకమ్మ తల్లి నామస్మరణ, పురోహితుల వేద మంత్రోచ్చారణలు, బాజాభజంత్రీల మేళతాళాల నడుమ ఆదివారం ప్రతిష్ఠలు నిర్వహించారు. అనంతరం 10 వేల మంది భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు

సినీ రంగానికి దాసరి చేసిన సేవలు వెలకట్టలేనివి



దాసరి నారాయణరావు స్వరాంజలి కార్యక్రమంలో పాల్గొన్న గాయనీ గాయకులు

విజయవాడకల్చరల్: దర్శకుడు దాసరి నారాయణరావు సినీ రంగానికి చేసిన సేవలు వెలకట్టలేనివని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం దాసరి జయంతి, ఘంటసాల, మాధవపెద్ది, పిఠాపురం నాగేశ్వరరావుల స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ దాసరి నారాయణరావు అని ఎందరో యువ నటులను తెలుగు తెరకు పరిచయం చేశారన్నారు. శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో గాయకత్రయంగా పిలుచుకొనే ఘంటసాల, మాధవపెద్ది, పిఠాపురం మధుర గీతాలను మనకు అందించారన్నారు. వివిధ రంగాలకు చెందిన బీవీ వీరభద్రరావు, జ్ఞాన కిషోర్, ప్రసంగించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు డేవిడ్‌రాజు, దండు చంద్రశేఖర్, మల్లాది స్వాతి, దుర్గానాగమణి, హేమమాలిని పలు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు.

విద్యార్థినికి అభినందన



మౌనిక

జి.కొండూరు: పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 576 మార్కులు సాధించి, మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన కవులూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థిని సగ్గుర్తి మౌనికకు అభినందనలు వెల్లువెత్తాయి. పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం మౌనికకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం



చాట్రాయి: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. చిన్నంపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన కళాజాతలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కోత విధించి క్రమేపీ పథకాన్ని రద్దు చేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ నెల 13న నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు కూలీలు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కొమ్ము ఆనందం, హోలీమేరీ పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలతో సాధారణ జీవితం



ఆగిరిపల్లి: కృత్రిమ అవయవాలతో దివ్యాంగులు ఆత్మవిశ్వాసం పెంచుకుని సాధారణ జీవితం కొనసాగించవచ్చని కోల్ ఇండియా విశ్రాంత జనరల్ మేనేజర్ బత్తుల కృష్ణ అన్నారు. మండలంలోని తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్‌లో గల కృత్రిమ అవయవ కేంద్రంలో 12 మంది దివ్యాంగులకు ఆదివారం కృత్రిమ కాళ్లు అందజేశారు. దాతలు శివరాత్రి కోటయ్య, మహాలక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు శివరాత్రి చంద్రమౌళి అందజేసిన ఆర్థిక సాయంతో 12 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేసినట్లు హీల్ సీఈఓ అజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హీల్ కార్యదర్శి టి.లక్ష్మి, ఫెసిలిటీస్ డైరెక్టర్ టి.భాస్కర్, హీల్ ప్రిన్సిపల్ సాయిబాబు, టెక్నీషియన్ సన్నీజాన్ పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు భూమి పూజ



శ్మశానవాటికలోని కర్మలసత్రానికి భూమి పూజ చేసిన దాతలు

గంపలగూడెం: గంపలగూడెం పటమట ఒంటు హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు దాతలు ఆదివారం భూమి పూజ చేశారు. గంపలగూడెం పంచాయతీ కార్యాలయం నుంచి మేడూరు వెళ్లే రహదారిలో పాపమ్మకుంట పక్కన ఉన్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు స్వర్గీయ నందిగామ వెంకట సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుమారులు నందిగామ వెంకట హరినాథ్, వెంకట పవన్‌కుమార్ రూ.10ల ఖర్చుతో శ్మశానవాటికను అభివృద్ధిపరుస్తున్నారు. కర్మలు నిర్వహించేందుకు అనువుగా రెండు గదులతో ఒక అంతస్తు భవనం, అవసర సమయాల్లో మృతదేహాలను ఉంచేందుకు అనువుగా కూలింగ్ బాక్స్‌లతో పాటు ఇతర అభివృద్ధి పనులను చేపడుతున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రతినిధులు కొత్తగుండ్ల నరసింహారావు, దారా లక్ష్మణరావు, బొడ్డు రమేష్, నందిగామ పురుషోత్తమరావు, కొల్లా నాగేశ్వరరావు, కేతేపల్లి హరిప్రసాద్, గ్రామస్తులు కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



చిన్నంపేటలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

చాట్రాయి: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను కాపాడదామని సామాజిక చైతన్య వేదిక ఆర్గనైజర్ ఈవీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మండలంలోని చిన్నంపేట గ్రామంలో నిర్వహించిన అల్లూరి వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రామకృష్ణ, కేవీపీఎస్ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి అశువులు బాసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఆదివారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులకు ఇచ్చిన సుదీర్ఘ వేసవి విరామాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం కానున్నట్లు గ్రంథాలయ అధికారి ఎం. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

జూన్ 11వ తేదీ వరకు జరిగే ఈ వేసవి శిబిరంలో కథలు వినటం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పటం, చిత్రలేఖనం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

పేకాట శిబిరాలపై దాడులు

ముసునూరు: నాలుగు గ్రామాల్లో పేకాట శిబిరాలపై ఆదివారం వరుస దాడులు చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.కుటుంబరావు చెప్పారు. కాట్రేనిపాడులో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,050 నగదు, ముసునూరులో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.1650 నగదు, చిల్లబోయినపల్లిలో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1,050 నగదు, యల్లాపురంలో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.2వేలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం 10 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.6,750 నగదు స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశామన్నారు. వీరిని సోమవారం నూజివీడు కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

అలరించిన సంగీత స్రవంతి

విజయవాడకల్చరల్: సద్గురు త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం జయంతి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను మధురంగా గానం చేశారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, కార్తీక త్రివేణి, చిట్టా కార్తీక్, చిట్టా దీపక్, లంక తేజస్విని, పారుపల్లి ఇభానస్ సోదరులు సుబ్రహ్మణ్య సంగీత సమితి విద్యార్థినులు త్యాగరాజ స్వామి రచించిన పలు కీర్తనలను మధురంగా గానం చేశారు. సంస్థ నిర్వాహకుడు సీవీ రావు త్యాగరాజ స్వామి కృతి వైభవం అంశంగా ప్రసంగించారు. రామలక్ష్మి నిర్వహించిన కార్యక్రమంలో తొలుత సంగీత కళాకారులు, అభిమానులు త్యాగరాజ స్వామి విగ్రహానికి పూజలు చేశారు.

8 నుంచి లోకోస్ శిక్షణ తరగతులు

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల వీఓలు, వీఓఏలకు వెలుగు కార్యాలయంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఏపీఎం శేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోకోస్ శిక్షణ వలన డేటా బేస్‌లో ఉన్న తప్పులను సరిచేసుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. 8, 9 తేదీల్లో శిక్షణ తరగతులు, 10న ఫీల్డ్‌లో లైవ్ డేటా వర్క్ జరుగుతుందని, వీఓలు, ఓఏలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

ఇబ్రహీంపట్నం: గుంటుపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి ఇంటి నుంచి ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఆమె తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ పి.శ్రీనుకేసు నమోదుచేసి ప్రత్యేక బృందాల ద్వారా విజయవాడలోని వివిధ ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అనుమానితుడు డొక్కా అన్వేష్ ఫోన్ లోకేషన్ ఆధారంగా విజయవాడ వైఎస్సార్ కాలనీ సమీపంలో ఓ చర్చి వద్ద ఆ యువతి, అన్వేష్ ఉన్నట్లు గుర్తించారు. అక్కడకెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. యువతిని ఆమె తల్లికి అప్పగించారు. గంటల్లో కేసు ఛేదించిన పోలీసులను బంధువులు అభినందించారు.